www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 2 సంచిక -102 బుధవారం 19 జూన్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,70306545

# ఏటీసీలుగా ఐటీఐలు

## మల్లేపల్లి ఐటీఐలో రేవంత్ రెడ్డి శంకుస్థాపన

**సమాజం చాలా వేగంగా అధునాతన టెక్నాలజీ వైపు దూసుకెళ్తోందన్న రేవంత్ రెడ్డి**

**యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టీకరణ**

**మారిన పరిస్థితులకు అనుగుణంగా ఏటీసీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడి**



హైదరాబాద్,జూన్ 18, ప్రజావినికిడి:
సమాజం చాలా వేగంగా అధునాతన టెక్నాలజీ వైపు దూసుకెళ్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మల్లేపల్లి ఐటీఐలో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ల (ఏటీసీ)కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ప్రపంచ అవసరాలకు సరితూగేలా శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దేందుకు ఏటీసీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేటు రంగంలోని ఇతర ఉద్యోగాలు అందిపుచ్చుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉంటే ప్రభుత్వ ఉద్యోగాల వైపు మాత్రమే చూడరని పేర్కొన్నారు. నైపుణ్యం లేకుండా కేవలం సర్టిఫికెట్ ఉంటే ప్రయోజనం లేదన్నారు.కాగా, ఐటీఐలను ఆధునీకరించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇందుకు రూ.2,324 కోట్ల నిధులను కేటాయించింది. వీటితో ఐటీఐలను అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. తెలంగాణలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేయనున్నారు. ఏటీసీలుగా మార్చేందుకు టాటా టెక్నాలజీస్‌తో ప్రభుత్వం అవగాహన కుదుర్చుకుంది.

# మాతో టచ్‌లో ఎన్డీయే నేతలు

**మోదీ ప్రభుత్వం మనుగడ కోసం ఇబ్బందిపడే అవకాశముందన్న రాహుల్ గాంధీ**

**ఎలాంటి వివక్ష లేకుంటే ఇండియా కూటమి మెజార్టీ దక్కించుకునేదని వ్యాఖ్య**

**చేతులు కట్టేసిన పరిస్థితుల్లో పోరాడామన్న రాహుల్ గాంధీ**



జూన్ 18, ప్రజావినికిడి:
న్యూఢిల్లీ : కేంద్రంలో అధికారంలోఉన్న ఎన్డీయే కూటమిని ఉద్దేశించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ నేతృత్వం లోని కూటమిలో తీవ్ర అసంతృప్తి ఉందని, దానిలోని కొందరు తమతో టచ్‌లో ఉన్నారని వ్యాఖ్యానించారు. ఓ ఆంగ్ల మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈమేరకు ఆయన మాట్లాడారు. అయితే ఎవరు తమతో టచ్‌లో ఉన్నారో ఆయన ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. " మోడీ నేతృత్వం లోని కూటమి మనుగడ కోసం ఇబ్బందిపడే అవకాశం ఉంది. అది బలహీనంగా ఉండడంతో ఏ చిన్న సమస్య అయినా ప్రభుత్వాన్ని కూల్చేయవచ్చు" అని వ్యాఖ్యానించారు. అలాగే ఎన్నికల వేళ మోడీ చేసిన ప్రసంగాలను ఉద్దేశించి విమర్శలు చేశారు. "మీరు విద్వేషాన్ని వ్యాప్తి చేసి , దాని ఫలితాలను పొంది ఉండొచ్చు.అయితే ఈసారి ఆ ఆలోచనలను ప్రజలు తిరస్కరించారు. ఎటువంటి వివక్ష లేని పరిస్థితులు ఉంటే, విపక్ష ఇండియా కూటమి నిస్సందేహంగా మెజార్టీ దక్కించుకొని ఉండేదన్నారు. మా చేతులు కట్టేసిన పరిస్థితుల్లో మేం పోరాడాం. అలాంటి సమయాల్లో ఏం చేయాలో ప్రజలకు కచ్చితంగా తెలుసు" అని అన్నారు. ఈసారి బీజేపీ 240 సీట్లు మాత్రమే దక్కించుకోవడంతో ఎన్డీయే కూటమి పక్షాలపై ఆధారపడక తప్పలేదు. మరోవైపు కాంగ్రెస్ గతంతో పోలిస్తే మెరుగైన ప్రదర్శన చేసింది. ఈసారి 99 స్థానాలు దక్కించుకుంది. ఇంటియా కూటమి పార్టీలకు 230 కి పైగా సీట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే రాహుల్ నుంచి స్పందన వచ్చింది.

# నీట్ అవకతవకలపై సుప్రీంలో విచారణ..

## ఎన్‌టీఏకు మొట్టికాయ!

పరీక్ష నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)పై సుప్రీంకోర్టు మండిపాటు

ఎక్కడైనా 0.001 శాతం నిర్లక్ష్యం ఉన్నా దానిని పూర్తిగా పరిష్కరించాలని సూచన

పరీక్ష నిర్వహించే ఏజెన్సీగా ఎన్‌టీఏ న్యాయంగా వ్యవహరించాలన్న అత్యున్నత న్యాయస్థానం

తదుపరి విచారణ జులై 8కి వాయిదా

2లో.




# కేసీఆర్‌ను అరెస్ట్ చేయాలని బీజేపీ తొందర పడుతుంది

**వివక్ష, ముందస్తు అభిప్రాయాలు లేకుండా విచారణ అధికారి విచారణ చేయాలన్న మాజీ మంత్రి**

**విద్యుత్ ఒప్పందాలపై కమిషన్ ముందే పలు విషయాలు వెల్లడించిందని వ్యాఖ్య**

**గత ప్రభుత్వానికి ఎలాంటి చెడు ఉద్దేశం లేదని ప్రజలకు అర్థమైందని కామెంట్**



2లో.

# పీఎం కిసాన్ నిధులు

## విడుదల చేసిన ప్రధాని మోదీ

**అర్హులైన రైతులకు ఏటా రూ.6 వేల సాయం**

**రూ.2 వేల చొప్పున ఏడాదిలో మూడుసార్లు అందజేత**

**ఇవాళ రైతుల ఖాతాల్లో రూ.20 వేల కోట్లు జమ**



హైదరాబాద్,జూన్ 18, ప్రజావినికిడి:
రైతులకు తోడ్పాటు అందించేందుకు కేంద్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట ఏడాదిలో మూడు విడతలుగా ఆర్థిక సాయం అందిస్తున్న సంగతి తెలిసిందే. మొత్తం రూ.6 వేలు అందిస్తుండగా, ఒక్కో విడతలో రూ.2 వేల చొప్పున అందిస్తున్నారు. తాజాగా, ప్రధాని నరేంద్ర మోదీ నేడు పీఎం కిసాన్ నిధులను విడుదల చేశారు. ఉత్తరప్రదేశ్ లోని తన నియోజకవర్గం వారణాసిలో జరిగిన ఓ కార్యక్రమంలో మోదీ ఈ నిధులను రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. మొత్తం 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ.20 వేల కోట్లు జమ చేశారు. 2019లో పీఎం కిసాన్ పథకం ప్రారంభించాక ఇప్పటివరకు 16 విడతల్లో నిధులు విడుదల చేశారు. ఇవాళ 17వ విడత నిధులు విడుదల చేశారు.



# దేశవ్యాప్తంగా 40 విమానాశ్రయాలకు బాంబు బెదిరింపు

జూన్ 18, ప్రజావినికిడి:
దేశంలోని 40 విమానాశ్రయాలకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. పాట్నా, కోయంబత్తూరు, జయపుర, వడోదర సహా పలు విమానాశ్రయాలకు బెదిరింపు వచ్చింది. కోయంబత్తూరు విమానాశ్రయానికి మధ్యాహ్నం 1.30 గంటలకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో విమానాశ్రయంలో బాంబు స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. విమానాశ్రయంలో భద్రతను పెంచారు. ఇతర విమానాశ్రయాలకు కూడా ఇలాంటి బెదిరింపు కాల్స్ వచ్చాయి. అన్ని విమానాశ్రయాలలోనూ తనిఖీ చేశారు. ఎలాంటి అనుమానిత వస్తువులు గుర్తించలేదు. బాంబు బెదిరింపు నేపథ్యంలో విమానాల రాకపోకలకు ఇబ్బందులు కలగలేదని అధికారులు తెలిపారు.

# ఇంగ్లీష్ మీడియంపై ఆసక్తి ఆత్మహత్య కంటే తక్కువేమీ కాదు : ఎన్‌సీఈఆర్టీ చీఫ్

జూన్ 18, ప్రజావినికిడి:
ఇంగ్లీష్‌తో నింపడం అంటే పిల్లలను మూలాలు, సంస్కృతి నుంచి దూరం చేయడమేనని వ్యాఖ్య ఇంగ్లీష్ మీడియాపై తల్లిదండ్రుల మోజు ఆత్మహత్య కంటే తక్కువేమీ కాదని ఎన్‌సీఈఆర్టీ చీఫ్ దినేశ్ ప్రసాద్ సక్లానీ అన్నారు. పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... చాలాచోట్ల సరైన శిక్షణ పొందిన ఉపాధ్యాయులు లేనప్పటికీ తల్లిదండ్రులు ఇంగ్లీష్ మీడియం వైపు మొగ్గ చూపుతున్నారన్నారు. ఇలా ఆసక్తి చూపడం అంటే కోరి కష్టాలు తెచ్చుకున్నట్లే అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కూడా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయన్నారు.కంటెంట్ మొత్తాన్ని ఇంగ్లీష్‌లో నింపడం వల్ల పిల్లలను వారి మూలాలు, సంస్కృతి నుంచి దూరం చేయడమే అవుతుందన్నారు. దీంతో పాటు విజ్ఞానంపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాతృభాష ఆధారిత బోధన ఉంటేనే మూలాలను సరిగ్గా అర్థం చేసుకోగలమన్నారు. ఇది వివిధ భాషలను నేర్చుకోవడానికి దోహదం చేస్తుందని తెలిపారు. భాష అంటే శక్తిని ఇచ్చేలా ఉండాలి తప్ప కోల్పోయేలా ఉండకూడదన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# రంగారెడ్డి జిల్లా బీజేపీ పతాధికారుల సమావేశంలో

## ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి..

**భవిష్యత్ లో తెలంగాణ లో బిజెపి యే ప్రత్యన్యాయం గా మారబోతుంది..**
**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి..**
**విశ్వేశ్వర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపిన షాద్ నగర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు..**



ప్రజావినికిడి,(శంషాబాద్): మంగళవారం రోజు శంషాబాద్ లో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పతాధికారుల సమావేశానికి ముఖ్య అతిధిగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సమావేశంలో తల్లోజు ఆచారి,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అందే బాబయ్య ,చెంది మహేందర్ రెడ్డి,హరీభూషణ్ ,కొమరబండ శ్రీశైలం,బోయ కుర్మయ్య,రఘురామ్ గౌడ్,మంగలి రమేష్,చెన్నయ్య తదితరులు పాల్గొని పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు.ఈ సందర్బంగా భవిష్యత్ లో ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి నేతృత్వంలో రంగారెడ్డి జిల్లా లో బీజేపీ పార్టీ బలోపేతం అవుతుందని,గ్రామ స్థాయి లో పార్టీ విస్తరిస్తుందని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేసారు.అదేవిదంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యన్యాయం బిజెపియే అని తెలంగాణ లో 8 ఎంపీ సీట్లను ప్రజలు గెలిపించారని,భవిష్యత్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ లు నెరవేర్చడం కోసం బీజేపీ పోరాటం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సమర్ధించుకునే ప్రయత్నం చేస్తున్నారు

## : కోదండరాం విమర్శలు



జూన్ 18, ప్రజావినికిడి:
గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ సమర్ధించుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం అన్నారు. భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్లు, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ విచారణ జరుపుతోంది. ఇందుకోసం హైదరాబాద్ లోని బీఆర్కే భవన్‌లోని కమిషన్ కార్యాలయానికి కోదండరాంతో పాటు విద్యుత్ శాఖ అధికారి రఘు వచ్చారు. వారిద్దరి నుంచి కమిషన్ వివరాలు అడిగి తెలుసుకుంది.అనంతరం కోదండరాం మీడియాతో మాట్లాడుతూ... ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వం తన అధికారాన్ని ఉపయోగించాలన్నారు. అభివృద్ధి అంటే ఒకరిద్దరికి లాభం చేయడం కాదన్నారు. గత ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్ల ట్రాన్స్‌కో, జెన్‌కోలకు రూ.81 వేల కోట్ల అప్పులు అయ్యాయన్నారు. గత ఏడాది వరదలు వస్తే భద్రాద్రి ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాల్సి వచ్చిందన్నారు.భవిష్యత్తులో గోదావరి వద్ద నీటి మట్టం పెరిగితే భద్రాద్రి ప్లాంటును కాపాడుకోగలమా? అని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వం నిర్ణయాల వల్ల సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఆ తప్పిదాలపై క్రిమినల్ చర్యలకు వెనుకాడవద్దని సూచించారు. అందరూ కూడా చట్టం ప్రకారమే నడుచుకోవాలన్నారు.

# నీట్ పరీక్ష అవకతవకలపై సుప్రీంకోర్టులో విచారణ..




హైదరాబాద్,జూన్ 18, ప్రజావినికిడి:
దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై దాఖలైన పిటీషన్‌లను తాజాగా సుప్రీంకోర్టు విచారించింది. ఈ సందర్భంగా అభ్యర్థులకు దేశవ్యాప్తంగా పరీక్ష నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)పై సుప్రీంకోర్టు మండిపడింది.ఈ ప్రక్రియలో ఎక్కడైనా 0.001 శాతం నిర్లక్ష్యం ఉన్నా దానిని పూర్తిగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. “పరీక్ష నిర్వహించే ఏజెన్సీగా మీరు న్యాయంగా వ్యవహరించాలి. పొరపాటు జరిగితే.. అవును, ఇది పొరపాటు అని చెప్పండి. కనీసం మీ పనితీరుపై విశ్వాసాన్ని కలిగిస్తుంది” అని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్‌లతో కూడిన ధర్మాసనం ఎన్‌టీఏకు తెలిపింది.దేశంలోనే అత్యంత కఠినమైన ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు విద్యార్థులు పడే కష్టాన్ని ఏజెన్సీ మరచిపోకూడదని సుప్రీంకోర్టు పేర్కొంది. “వ్యవస్థను మోసం చేసిన వ్యక్తి డాక్టర్ అవుతాడని అనుకోండి. అప్పుడు అతను సమాజానికి మరింత హాని కలిగిస్తాడు” అని పేర్కొంది. ఈ కేసులో తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. ఇదిలాఉంటే.. నీట్ పరీక్షలో అవకతవకలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. దేశవ్యాప్తంగా పరీక్ష నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# కేసీఆర్‌ను అరెస్ట్ చేయాలని బీజేపీ తొందర పడుతుంది

## : మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



హైదరాబాద్,జూన్ 18, ప్రజావినికిడి:
గత ప్రభుత్వంపై నిందలు వేయడానికి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై బురదజల్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం స్వార్ధ రాజకీయాలతో విచారణ కమీషన్లు వేస్తోందని మాజీ మంత్రి ఎమ్మెల్యే జి.జగదీష్ రెడ్డి అన్నారు. నేడు (మంగళవారం) తెలంగాణ భవన్‌లో జగదీష్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ె% నాలుగు అంశాల్లో ఎక్కడా చిన్న తప్పు లేదని, ఒక్క రూపాయి కూడా నష్టం జరగలేదని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా కమిషన్‌తో మీడియా సమావేశం పెట్టించి గతంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు మాట్లాడిన మాటలు చెప్పించారని అన్నారు.కేంద్రమంత్రి బండి సంజయ్ తెలివి తక్కువతనం, మూర?త్వంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేయాలని బీజేపీకు తొందరగా ఉన్నట్లుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ వేరు కాదని%ె% సీఎం రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కలిసి పని చేస్తున్నారని ఐదేళ్లుగా చెబుతున్నామని జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.

### కమిషన్‌కు ముందస్తు అభిప్రాయాలు ఉండొద్దు..

”ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపే ప్రయత్నం చేశారు. కేసీఆర్ తన లేఖలో అన్ని అంశాలను స్పష్టంగా వివరించారు, ప్రజలకు అన్ని విషయాలు స్పష్టంగా అర్థమయ్యాయి. కమిషన్‌కు ఎలాంటి ముందస్తు అభిప్రాయాలు ఉండరాదు. దురదృష్టవశాత్తూ కమిషన్ తన ఉద్దేశాన్ని ముందే బయట పెట్టింది. వాస్తవానికి జస్టిస్ నరసింహారెడ్డి విచారణకు అంగీకరించి ఉండాల్సింది కాదు. కేసీఆర్ విషయంలో ఏమీ తేల్చలేమని చెప్పి%ె% రాష్ట్ర ప్రభుత్వం మీడియాకు లీకులు ఇచ్చింది. ఛత్తీస్‌ఘడ్ ఒప్పందంతో రూ. 6000 కోట్ల నష్టం కాదు.. అంతకు మించి లాభం జరిగింది. లీకులను సమర్థించేలా కొందరితో ఈ రోజు మాట్లాడించారు. 17 వేల మిలియన్ యూనిట్లు తీసుకొని ఛత్తీస్‌ఘడ్‌కు రూ.7000 కోట్లు చెల్లిస్తే రూ.6000 కోట్ల దుర్వినియోగం ఎలా అవుతుంది?. ఛత్తీస్‌ఘడ్‌కు సరిపడా విద్యుత్ ఇవ్వకపోవడంతో ఎక్కువ ధరకు కొన్నారు. నష్టం జరిగిందని ఇప్పుడు అంటున్నారు. మరి ఛత్తీస్‌గడ్ ఒప్పందం లేకపోతే 17 వేల మిలియన్ యూనిట్లకు 17 వేల కోట్లు కట్టాల్సి వచ్చేది” అని జగదీష్ రెడ్డి తెలిపారు.

### సమైక్య రాష్ట్రంలో కలపడానికి కుట్ర

ఉత్తర భారతం నుంచి కరెంట్ తీసుకోకుండా కేసీఆర్ ఫెయిల్ అయితే మళ్లీ సమైక్య రాష్ట్రంలో కలపాలన్నది వీరు కుట్ర. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలంటే%ె% తెలంగాణ లేకుండా చేయాలి. తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు, పదవుల్లో ప్రతి అక్షరంలో కేసీఆర్ పేరు ఉంది. కేసీఆర్‌కు మసి పూయాలన్న చిల్లర ప్రయత్నం చేస్తున్నారు. దమ్ముంటే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఎందుకు మీడియా సమావేశం పెట్టి చెప్పలేదు?. దొంగలుగా చీకట్లో ముసుగులు వేసుకొని ఎందుకు వ్యవహరిస్తున్నారు. రూ. 6000 కోట్ల నష్టం అన్న కథనాల్లో ప్రతి అక్షరం అబద్దమే. అవినీతి జరిగితే రమణ్‌సింగ్, కాంగ్రెస్ సీఎంలకు ఇచ్చారా? నల్గొండ జిల్లాలో విద్యుత్ కేంద్రం ఎందుకు పెట్టారని ఎవరైనా ప్రశ్నిస్తే ఖబర్దార్. నల్గొండ జిల్లా తెలంగాణలో లేదా ? కోదండరాంకి నల్గొండ కనిపించడం లేదా? నల్గొండ జిల్లా దద్దమ్మ నేతలు నాటి లాగే ఇప్పుడు కూడా నోరెత్తకుండా వ్యవహరిస్తున్నారు, ప్రజలు అన్నీ గమనిస్తున్నారు” అని జగదీష్ రెడ్డి మండిపడ్డారు.

### కోదండరాం డొంక తిరుగుడుగా మాట్లాడొద్దు

”నాడు ఛత్తీస్‌గడ్ నుంచి రూ.3.90కి యూనిట్ విద్యుత్ కొనకముందు జజ్జర్ నుంచి రూ. 17 రూపాయలకు యూనిట్ విద్యుత్ కొనుగోలు చేసే వాళ్లం. టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం సూటిగా సమాధానం చెప్పాలి, డొంక తిరుగుడుగా మాట్లాడొద్దు. దొంగలతో చేతులు కలిపి ఉన్న ఈర్ష్యను చాటుకుంటున్నారు. హైదరాబాద్‌లో గతంలో విద్యుత్ కోతలతో లక్షల జనరేటర్లతో వచ్చిన శబ్ద, వాయు కాలుష్యం ఎంత? ఎంత మంది క్యాన్సర్ బారిన పడి ఉంటారు. మణుగూరు విద్యుత్‌తో హైదరాబాద్‌లో కోతలు పోయి జనరేటర్లు బంద్ కావడం వల్ల ఎంత మేలు జరిగిందో ప్రజలు ఆలోచించుకోవాలి. తమకు పెట్టిన ఖర్చు కంటే తక్కువ ఆదాయం వచ్చిందని ఛత్తీస్‌ఘడ్ అంటుంటే కేసీఆర్ తెలంగాణకు ఎలా అన్యాయం చేశారు..? గతంలో యాదాద్రి విద్యుత్ కేంద్రం బంద్ చేయిస్తామన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి%ె% రోషం ఉంటే ప్రారంభోత్సవానికి పోకూడదు. కోదండరాం చిన్న పదవి కోసం ఆశ పడి దొంగలకు మద్దతు పలుకుతున్నారు. ఎమ్మెల్సీ పదవి కోసం కోదండరాం పాకులాడుతున్నారు” అని జగదీష్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

# ప్రపంచస్థాయి నగరాలతో హైదరాబాద్ పోటీ




హైదరాబాద్,జూన్ 18, ప్రజావినికిడి:
:అభివృద్ధిలో ప్రపంచస్థాయి నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆరు నెలలుగా తాము చేపట్టిన వినూత్నమైన అభివృద్ధి కార్యక్రమాలతో మరింత అద్భుతంగా తయారవుతుం దన్నారు.మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో కుష్ మన్ అండ్ వేక్ ఫీల్డ్ సంస్థ ఆసియా పసిఫిక్ సీఈవో మ్యాథ్యూ భౌ ప్రతినిధి బృందం భేటీ అయింది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో హైదరాబాద్ గ్లోబల్ సిటీ వృద్ధి చెందుతున్న తీరు, వివిధ రంగాలు విస్తరిస్తున్నతీరుపై చర్చించారు. గ్రేటర్ హైదరాబాద్ సిటీ దేశంలోనే శరవేగంగా వృద్ధి చెందుతుందని కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్ కంపెనీ ప్రతినిధి బృందం ఈ సందర్భంగా తమ అధ్యయన వివరాలను పంచుకుంది.గడిచిన ఆరు నెలల్లో రియల్టీతో పాటు లీజింగ్, ఆఫీస్ స్పేస్, నిర్మాణ రంగం, రెసిడెన్షియల్ స్పేస్ లోనూ హైదరాబాద్ సిటీ గణనీయమైన వృద్ధి నమోదు చేసిందని అభిప్రాయపడిరది. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలకు సంబంధించి ప్రతి ఆరు నెలలకోసారి వెల్లడిరచే తమ నివేదిక జులై నెలాఖరులో వెలువడుతుందని తెలిపింది. తమ ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు రూట్ విస్తరణతో హైదరాబాద్ మరింత అద్భుతంగా తయారవుతుందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తాము దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, హైదరాబాద్ను ప్రపంచంలో పేరొందిన నగరాల సరసన నిలబెట్టాలనేది తమ సంకల్పమని అన్నారు. తెలంగాణ నుంచి అమెరికాలో ఉంటున్న వారి సంఖ్య, అక్కడి వెళ్లి వచ్చే వారి సంఖ్య పెరిగిపోయిందని, అందుకే న్యూయార్క్తో పోల్చుకునేలా హైదరాబాద్ ను తీర్చిదిద్దాల్సి ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.

# వాస్తవానికి దగ్గరగా ఎలాన్ మాస్క్ వ్యాఖ్యలు

## ఈవీఎంలపై కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ సంచలన వ్యాఖ్యలు..

హైదరాబాద్,జూన్ 18, ప్రజావినికిడి:
దేశంలో ప్రపంచవ్యాప్తంగా ఈవీఎంల పనితీరుపై నెగిటివ్ కామెంట్లు వస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఎలాన్ మాస్క్ సైతం ఈవీఎం పనితీరుపై నెగెటివ్ కామెంట్లు చేశారు.ఈవీఎంలను హ్యాక్ చేయొచ్చని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఈవీఎం ట్యాంపరింగ్ విషయంపై చర్చ జరుగుతుంది. ఇదే సమయంలో ఇటీవల ముంబై నార్త్ వెస్ట్ ఎన్నికలలో ఈవీఎం ట్యాంపర్ చేశారు.. అని ఆరోపణలు రావటం జరిగాయి.ఇదిలా ఉంటే ఏపీ ఎన్నికలలో వైసీపీ ఘోరంగా ఓడిపోవడం పట్ల కూడా ఆ పార్టీ నేతలు ఈవీఎం ట్యాంపరింగ్ పై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. వైసీపీ అధినేత వైయస్ జగన్ సైతం ఈ విషయంపై సోషల్ మీడియా వేదికగా సంచలన పోస్ట్ కూడా పెట్టడం జరిగింది.ప్రపంచం మొత్తం మీద ప్రజాస్వామ్యం కొనసాగుతున్న అత్యధిక దేశాలలో ఎన్నికల ప్రక్రియ కోసం పేపర్ బ్యాలెట్లు వాడుతున్నారు. ఈవీఎంలు కాదు.ప్రజాస్వామ్యం అసలైన స్ఫూర్తిని కొనసాగించేందుకు మనం కూడా ఇదే దిశగా ముందుకు సాగాలి అని పోస్ట్ పెట్టడం జరిగింది. సిపిఐ నారాయణ ( సైతం.. స్పందించారు. 122 దేశాలలో ఈవీఎంలు వినియోగించడం లేదు.చాలా దేశాల్లో బ్యాలెట్ పేపర్లనే వినియోగిస్తున్నారు. ప్రపంచ దేశాలకు ఈవీఎంలపై అనుమానాలు ఉన్నాయి. మనదేశంలో మాత్రం అనుమానాలను ఆరోపణలను పట్టించుకోవడం లేదు. అందుకే వచ్చే ఎన్నికల్లో ఈవీఎంలను




వినియోగించకూడదు పేపర్ బ్యాలెట్స్ ద్వారా ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు.ఇదే విషయంపై తాజాగా తెలంగాణ కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ స్పందించడం జరిగింది. ఈవీఎంల పనితీరుపై ఎలాన్ మాస్క్ వ్యాఖ్యలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్రానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా... ఉన్నత స్థాయి విచారణ జరపాలి.ఈవీఎంల వల్ల భారత ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు వాటిల్లుతుంది. వాటి సామర్థ్యాన్ని మన దేశం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. టెక్నాలజీతో ఈవీఎంలను హ్యాకింగ్, టాంపరింగ్ చేసే అవకాశం ఉంది. బ్యాలెట్ పద్ధతే ప్రజాస్వామ్యానికి మంచిది అని తెలిపారు

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
బుధవారం 19 జూన్ 2024

# సర్వే నం:-348/1

# ప్రభుత్వ స్థలం కబ్జా...

## జగద్గిరిగుట్ట ప్రాంతంలోని పరికిచెరువు ఇతర స్థలాలను కాపాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం...






ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 డివిజన్ పరిధి జగద్గిరిగుట్ట లో బాలక్రిష్ణ అనే వ్యక్తి సర్వే నం:-348/1 గల పరికి చెరువు అలాగే మిగితా స్థలాలను కబ్జాచేసుకొని సుమరు 5 వందల కోట్లు ప్రభుత్వ స్థలాన్ని పేదప్రజలకు ఎలాంటి అనుమతి లేకుండా విక్రహించి సొమ్ము చేసుకుంటున్నాడు.ఈ విషయమై మంగళవారం తెలంగాణ ప్రభుత్వంలో రెవెన్యూ అలాగే హౌసింగ్ అలాగే ఇన్ఫర్మేషన్,పబ్లిక్ రిలేషన్స్ శాఖలతో క్యాబినెట్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ గణేష్, సీఓ-ఆర్డినేటర్ నరేందర్ రెడ్డి,జనరల్ సెక్రటరీ రవీందర్, కోశాధి కారి రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ శ్రీవాస్ చారీ అలాగే సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి,వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి...

## కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి.. ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలి.. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రేవతి డిమాండ్..

**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి షాపూర్ నగర్ లో మంగళవారం తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో బి.లింగస్వామి అధ్యక్షతన షాపూర్ నగర్ కార్యాలయంలో పలు సమస్యలపై సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేవతి మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలో పిహెచ్ సి లలోపనిచేస్తున్న ఆశా వర్కర్లకు నెలనెల వేతనాలు రాక ఎప్పుడు వస్తాయో ఎదురు చూడటం జరుగుతుందని రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్లు ఆర్థిక ఇబ్బందులకు గురికావలసి వస్తుందని రాష్ట్రంలో సుమారు 30 వేల మంది ఆశా వర్కర్లు



గత 18 సంవత్సరాల నుండి ఎన్ హెచ్ ఎం స్కీం ద్వారా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు వీరంతా మహిళలు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికులు ఉన్నారు ఇప్పటివరకు వీరికి కనీసం ఫిక్స్ వేతనం కూడా ప్రభుత్వం నిర్ణయించలేదు..పిఎఫ్ ఈఎస్ఐ తదితర సౌకర్యాలు లేవు ఈ పరిస్థితులలో ఒక కుటుంబం బతకాలంటే కనీసం 26 వేల రూపాయలు ఉంటే సాధ్యమవుతుందని లెక్కలు చెబుతున్నాయి,కానీ ప్రభుత్వాలు ఈ అంశాన్ని పరిశీలించి పరిష్కరించడంలో విఫలమైనాయని ఆశా వర్కర్స్ సంఘటితంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడుతా, ఉంటే కొంతమంది ఆశా వర్కర్ల యూనియన్ల ముసుగులో కార్మికుల ఐక్యతను దెబ్బతీసే విధంగా కార్మికుల్ని విచ్ఛిన్నం చేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని ఆ యూనియన్ల విషయంలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని గతంలో 9 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని ఏలిన నాయకులు రాష్ట్రవ్యాప్త రంగాలలో పనిచే స్తున్న కార్మికుల సమస్యలు ఏనాడు పట్టించుకోనటువంటి నాయకులు అధికారం ఊడిన తరువాత కార్మికులు గుర్తొస్తున్నారని నక్కజిత్తుల మాయమాటలతోటి కార్మికుల ఐక్యతను తీయాలని చూస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ, సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్,దుండిగల్ పిహెచ్ సి ఆశాలు హంస, పద్మ,విజయ, సునీత,లక్ష్మి,రేణుక, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆసరా పెన్షన్ అవస్థలు....

## డిజిటల్ యుగంలో కూడా బ్యాంకు అకౌంట్ లోకి అమౌంట్ రాక క్యూలైన్లో నిల్చోలేకా అవస్థలు పడుతున్న వృద్ధులు, వికలాంగులు...



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు ,వికలాంగులకు ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఆసరా పెన్షన్ ఎప్పుడు వస్తుందో పోస్ట్ ఆఫీస్ వారు ఎప్పుడు ఇస్తారో..? తెలియక పెన్షన్ దారులు రోజు పోస్ట్ ఆఫీస్ వద్ద పడిగాపులు కాస్తున్నారని కొన్నిసార్లు పెన్షన్ వచ్చినప్పటికీ మిషిన్లు పనిచేయక నెట్వర్క్ లేక గంటలకొద్ది క్యూలైన్లో నిలబడడం పోస్ట్ ఆఫీస్ సిబ్బంది ఇదేమని అడిగితే పెన్షన్ దార్లపైన చిరాకులు పడడం నిత్యపరపాటిగా జరుగుతుంది సరే తర్వాత వచ్చి తీసుకుందామని భావిస్తే రెండు నెలలు తీసుకోకుంటే ఉన్న పెన్షన్ కాస్త మొత్తం పోతుందేమోనని భయంతో వృద్ధులు వికలాంగులు గంటల తరబడి లైన్లో నిలబడి ఇబ్బంది పడుతున్నారు. గతంలోనే పెన్షన్ అమౌంట్ సంబంధిత పెన్షన్ దారుని బ్యాంక్ అకౌంట్ లో డిపాజిట్ చేయడానికి సంబంధిత పెన్షన్ దారుల నుండి బ్యాంక్ అకౌంట్ డీటెయిల్స్ తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు అది ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. మారుమూల గ్రామాలలో కూడా పెన్షన్ బ్యాంక్ అకౌంట్లో జమ చేస్తున్నప్పటికీ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ లో మాత్రం పెన్షన్ కోసం రోజుల తరబడి వేచి చూస్తూ పెన్షన్ తీసుకోవడానికి గంటల తరబడి క్యూలో నిల్చడానికి ఓపిక లేక వృద్ధులు వికలాంగులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. గతంలో కూడా ఈ



విషయాన్ని అనేకమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ అధికారులు ప్రజాప్రతినిధులలో ఎలాంటి చలనం లేదన్నారు. ఇప్పటికైనా పెన్షన్ దార్ల అకౌంట్లో డబ్బులు డిపాజిట్ చేసే విధంగా కార్పొరేషన్ కమిషనర్ వెంటనే చర్యలు చేపట్టి పెన్షన్ దారులను ఆదుకోవాలని లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ మరియు బిజెపి నాయకులు బిక్షపతి యాదవ్ డిమాండ్ చేశారు.

# ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం...

**ఎమ్మెల్సీ,మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు.**





ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు మంగళవారం శంభీపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.


# కార్మికుడు కుటుంబాన్ని ఆదుకున్న శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి సింగ్..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్) : ఎక్కడ కార్మికులకు అన్యాయం జరిగినా వారికి న్యాయం జరిగేలా చూసే బి.ఆర్.ఎస్.కె.వి రాష్ట్రకార్మిక నాయకులు,శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి సింగ్ మరోసారి ఓ కార్మికు కుటుంబానికి అండగా నిలిచారు.ఈ మేరకు మెదక్ జిల్లా మనోహరాబాద్ కలకల్ లో ఉన్న మహాలక్ష్మి ప్రైవేట్ లిమిటెడ్ (ఎం.పి.ఎల్) కంపెనీలో ఒరిస్సా బలాసూర్ కు చెందిన అజయ్ కుమార్ రావత్ ప్రమాదవశాత్తు మరణించాడు.కంపెనీ యాజమాన్యం పూర్తిస్థాయిలో స్పందించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు రాష్ట్ర కార్మిక నాయకులు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి సింగ్ ను సంప్రదించారు.వెంటనే స్పందించిన రవి సింగ్ సదరు యాజమాన్యంతో మాట్లాడి అక్కడ జరగాల్సిన కార్యక్రమాలు జరిపించడంతోపాటు వారి కుటుంబానికి కంపెనీ యాజమాన్యం నుండి 7,50,000 లు వచ్చేలా చేశారు.రాష్ట్ర కార్మిక నాయకులు 7,50,000 చెక్కును వారి కార్యాలయంలో కార్మికుడి భార్య గీతాంజలి కి వారి కుటుంబ సభ్యులు సిద్దేశ్వర్,తదితరుల సమక్షంలో అందజేశారు.ఈ సందర్భంగా రవి సింగ్ మాట్లాడుతూ, కార్మికులకు ఎక్కడైనా ఎప్పుడైనా అండగా ఉంటానని,న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

# శ్రీ శ్రీ ఎల్లమ్మ పోచమ్మ నాగదేవత ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న బిజెపి నాయకులు..





ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం125గాజులరామార%శీ% డివిజన్ పరిధిలోని కైసర్ నగర్ లో గల శ్రీ శ్రీ ఎల్లమ్మ పోచమ్మ నాగదేవత దేవాలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు మల్లారెడ్డి , కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజెపి కన్వీనర్ శేఖర్ యాదవ్ , గాజులరామార%శీ% డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి, డివిజన్ బీజెపి ప్రెసిడెంట్ సాయి, జనరల్ సెక్రెటరీ జ్ఞానేశ్వర్ , మహిళా మోర్చా నాయకురాలు రేవతి రెడ్డి,సింగారం మల్లేష్, సాయిబాబా, శ్రీనివాస్,బాలకృష్ణ, తదితర ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చెట్టుకు ఉరి వేసుకుని ఆటో డ్రైవర్ ఆత్మహత్య...



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో చెట్టుకు ఉరి వేసుకుని ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం..జిహెచ్ఎంసి కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం వెనకవైపు ఉన్న నిర్మానుష్య ప్రదేశం లో గుర్తుతెలియని ఓ ఆటో డ్రైవర్ సుమారు (25) వయస్సు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జీడిమెట్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బాధితుడికి కాంగ్రెస్ నాయకులు ఆరిక సాయం..



ప్రజావినికిడి,(నందిగామ):మామిడిపల్లి గ్రామంలో గత వారం పిడుగు పడి 8 మూగ జీవాలు(6 మేకలు,2 గొర్రెలు) మరణించాయి.కాగా నిరుపేద రైతు అయిన బొద్ద శంకరయ్య జీవనాధారం మేకలు పెంపకం కావడంతో తననీ ఆదుకోవాలని ఆవేదన చెందారు. దానికి స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యకులు నవీన్ గౌడ్ 10వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్స్ పార్టీ ఉపాధ్యక్షులు అనీల్ రెడ్డి సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి,రామ చంద్ర రెడ్డి, లక్మ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,రెబెల్ చిట్టి యాదవ్,రామ కృష్ణ యాదవ్,విక్రమ్, సురేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టరేట్ ను ముట్టడి చేసిన ఆదివాసి,రైతు,వ్యవసాయ కార్మిక సంఘాలు

-పోడు సాగు దారులపై ఫారెస్ట్ శాఖ దౌర్జన్యాలు ఆపకుంటే పోరాటం ఉధృతం.
-పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి
-రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలి.
జిల్లా ఇంచార్జి మంత్రి,ఎంపీ,ఎమ్మెల్యేలు స్పందించాలి..





ప్రజావినికిడి, (చెన్నూర్):జూన్18, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం,తెలంగాణ రైతు సంఘం,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘల ఆధ్వర్యంలో మంగళవారం రోజున మంచిర్యాల జిల్లాలోని పోడు రైతుల సమస్యలు పరిష్కరించుట గురించి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేసారు.ఈ సందర్భంగా పూసం సచిన్ తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ,మంచిర్యాల జిల్లాలో ఆదివాసీలు ఇతర పేదలు పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు.గతంలో కొంత భూమికి హక్కుపత్రాలు వచ్చాయి.ఇంకా చాలా భూములకు రావాల్సి ఉంది.పోడు సాగున్న కొన్ని మండలను,గ్రామాలను పోడు జాబితాల్లో చేర్చలేదు.ఈ సంవత్సరం అటవీ శాఖ అధికారులు హక్కుపత్రాలు వచ్చినవారిపై అలాగే రానివారిపైన దాడులు చేస్తున్నారు.భూములను సాగు చేసుకునివ్వడం లేదు.కోటపల్లి రేంజ్ పరిధిలోని అన్ని గ్రామాల్లో అటవీ హక్కు పత్రాలు వచ్చిన పోడు వ్యవసాయ భూములను సాగు చేసుకుని ఇవ్వకుండా అడ్డుపడుతున్నారు.బండారు రవి కుమార్ తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ,కోటపల్లి మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన భాగాల చంద్రయ్య,బాగాల మల్లయ్య అను రైతులు తమ భూమిని దున్నుతుండగా అటవీశాఖ అధికారులు వారిని అక్రమంగా అరెస్టు చేసి రెండు రోజులు తమ కార్యాలయంలో బంధించారు.వారి వద్ద ఉన్న బైకును తీసుకుపోయి బంధించారు 20 రోజులు గడుస్తున్నా నేటికీ బైక్ ను ఇవ్వలేదు.సుపాక గ్రామంలో హక్కుపత్రం వచ్చిన భూములను దున్నుతుండగా అటవీశాఖ అధికారులు రైతులను వెళ్ళగొట్టారు.బొప్పారం గ్రామంలో హక్కుపత్రాలు రాని రైతులు ఎడ్ల నాగాళ్ళ తో దున్నుతుండగా ఏడునాగాళ్ళను అటవీ అధికారులు తీసుకువెళ్ళారు.ఎర్మ పున్నం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ,జిల్లాలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. రైతులు విత్తనాలు వేస్తున్నారు.కానీ పోడు రైతులు ఎవ్వరు కూడా కనీసం పంటలను వేసుకొని ఇవ్వడం లేదు.ఆదివాసీలు ఫారెస్ట్ శాఖ అధికారుల మూలంగా అన్యాయానికి గురైనారు.జిల్లాలోని కొన్ని గ్రామాలకు పోడు జాబితా లేకుండా పోయింది.జిల్లాలో పోడు హక్కుపత్రాలు న్నప్పటికీ బ్యాంకు వారు పెట్టుబడి రుణాలు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారు.దీనివలన ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపైన ఆధారపడి వ్యవసాయం చేసుకోవాల్సిన దుస్థితి వస్తున్నాయి.కావున తమరు జోక్యం చేసుకొని ఈ క్రింది సమస్యలను పరిష్కరించాలని కోరుచున్నాము.వారు అన్నారు.

1,పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి 2,హక్కు పత్రాలు ఉన్న భూములను ట్రాక్టర్ తో దున్నుకొనివ్వాలి
3,హక్కుత్రాలున్న భూములకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి
4,పోడు సాగుదారులపైన పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి
5,ఫారెస్ట్ శాఖలో బంధించిన పోడు రైతుల ట్రాక్టర్లను, బైకులను,నాగళ్ళను విడుదల చేయాలి
6,పోడు సాగున్న ప్రతి మండలం,గ్రామాలను పోడు జాబితాలో చేర్చాలి
7,ఫారెస్ట్ శాఖ అధికారుల వేధింపులు ఆపాలి.

ఈ కార్యక్రమంలో సంకే రవి ఏఐ.కె.ఎస్ జిల్లా అధ్యక్షులు,బ్రహ్మయ్య తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు,బాగాల రాజన్న ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు,ఎలిగేటి లక్ష్మి,ఎస్సే.అబ్దుల్లా,ఆత్రం చిన్న రాజు,దోసండ్ల సునీత,సిడం సమ్మక్క,సూర్ పటేల్ మద్దతు పలికిన సంఘాలు రంజిత్ కుమార్ సిఐటియు జిల్లా కార్యదర్శి,జి.ప్రకాష్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు,కొమ్ముల బాపు నాయకపోడ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి,చల్లూరి దేవదాస్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు,జక్కుల మారయ్య తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు,ఆర్.నగేష్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి,గోమాస అశోక్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు,అభినవ్,శ్రీకాంత్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ఆయా గ్రామాల నుండి ఆదివాసీ గిరిజన పేదలు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల సమర్పణ, జాతరాలను నిర్వహిస్తూ అమ్మవారిని కొలవడం తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలలో భాగం

### :ఎమ్మెల్యే కేపీ.వివేకానంద...





ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్): దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్ గ్రామంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర,శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన ప్రధమ వార్షికోత్సవ వేడుకలకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద మాట్లాడుతూ బోనాల సమర్పణ,జాతరాలను నిర్వహించడం ద్వారా అమ్మవారి కృపా కటాక్షాలు మనపై సంపూర్ణంగా ఉంటాయని నమ్ముతూ తెలంగాణ ప్రజలు అమ్మవారికి వేడుకలు నిర్వహిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు జక్కుల విజయ శ్రీనివాస్ యాదవ్, దాసరిపల్లి ఆనంద్, ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి,వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, దేవాలయ చైర్మన్ ఈదులకంటి నరసింహా గౌడ్,గౌడ సంఘం అధ్యక్షులు బిక్షపతి గౌడ్,తురాయి పాండుగౌడ్, డైరెక్టర్ ఈదులకంటి యాదయ్య,ఆలయ కమిటీ సభ్యులు ఈదుల కంటి శ్రీనివాస్ గౌడ్,ఎం.సుధాకర్ గౌడ్,ఎల్.అరుణ్ గౌడ్, నర్సింగ్ రావ్ గౌడ్,ఎం. జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కోదండరాంను సన్మానించి టీఎన్జీవోస్..




ప్రజావినికిడి, (నాంపల్లి): టిఎన్జిఓస్.కేంద్ర సంఘ యూనియన్ నూతన అధ్యక్షులు మారం జగదీశ్వర్,నూతన ప్రధాన కార్యదర్శి డాక్టర్. ఎస్.ఎం.హుస్సని (ముజీబ్) మంగళవారం నాడు ప్రొఫెసర్ కోదండరామ్ ను వారి కార్యాలయంలో శాలువాతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో నాలుగో తరగతి అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, కేంద్ర సంఘ నాయకులు చంద్రశేఖర్,జిల్లా సభ్యుడు బొల్లిగిద్ద శంకర్,ఆర్టిఏ అధ్యక్షుడు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రప్రస్థ కాలనీ వాసుల సమస్యలు త్వరలోనే తీరుస్తా..

### సురేందర్ యాదవ్..



ప్రజావినికిడి,(నాగోల్):మంగళవారం రోజు నాగోల్ డివిజన్ లోని ఇంద్రప్రస్థ కాలనీ లో నాగోల్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ కాలనీ వాసులతో కలిసి పర్యటించారు.కాలనీ అభివృద్ధికి అలాగే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాలనీవాసులు కోరడం జరిగింది.స్పందించిన కార్పొరేటర్ అతి త్వరలోనే ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గోపాల్,అప్పారావు, వెంకటేశ్వర్లు,హరిబాబు,వరకుమార్,ప్రేమ్ బాబు పాల్గొన్నారు.



## ప్రజా సేవలో నిత్యం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్): కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందినపలువురు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అభిమానులు సంక్షేమ సంఘాల సభ్యులు ప్రజలు కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెలే కేపీ వివేకానంద ని కలిసి పలు ఆహ్వానాలు, వినతిపత్రాలు అందజేశారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే నూతన అభివృద్ధి పనులకు శ్రీకారం చేపడుదామన్నారు.

## రాజీవ్ గృహకల్ప 33 వ,డివిజన్ లో నూతన బస్ స్టాప్ నిర్మించాలి...

### కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసిన కాలనీవాసులు..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్) నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప 33 వ డివిజన్ లో నూతన బస్ స్టాప్ నిర్మించుటకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వివరించడం జరిగింది. దీనికి కెఎస్ఆర్ సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, పితాని శ్రీనివాస్, రామచందర్ నాయక్, నాగభూషణ్, రమణ బాబు, మెడికల్ షాపు రమేష్, రవీంద్ర తదితరులు పాల్గొనడం జరిగింది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# గుత్తాపై అవిశ్వాసం..?

హైదరాబాద్,జూన్ 18, ప్రజావినికిడి:

రాష్ట్రం మరో పొలిటికల్ వార్‌కు సిద్ధం అవుతున్నది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పరాభవాన్ని చవిచూసిన భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్) శాసన మండలిలో తనకున్న సంఖ్యాబలాన్ని నిలబెట్టుకుంటుందా, జారవిడుచుకుంటుందా అన్నది ఇప్పుడు రాష్ట్రంలో ప్రధానాంశంగా మారింది.

శాసనసభ ఎన్నికల్లో పరాభవాన్ని చవిచూసిన బిఆర్ఎస్ మండలిలోనైనా తనకు బలముందన్న భావనతో ఉంది. కాంగ్రెస్‌పై తనకున్న ఆగ్రహాన్ని మండలిలో బిల్లుల ఆమోదం తదితర విషయాల్లో కొంతవరకు తన పవర్‌ను చూపించవచ్చన్న భావనలో ఉంది. మండలి చైర్మన్ కూడా బిఆర్ఎస్ పార్టీకి చెందినవాడే కావడం వల్ల శాసనసభలో కాకున్నా, మండలిలో కాంగ్రెస్ దూకుడును అడ్డుకునే అవకాశం ఆ పార్టీకి లేకపోలేదు. అయితే అనూహ్యంగా ఇప్పుడు చైర్మన్ పైనే స్వీయపార్టీ అవిశ్వాస తీర్మానం పెట్టనున్నట్లు వార్తలు రావడం రాజకీయవర్గాల్లో పెద్ద చర్చనీయాంశమైంది. వాస్తవంగా తాజా పార్లమెంటు ఎన్నికలు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో అనేక మార్పులకు కారణంగా మారాయి. పదేళ్ళు రాష్ట్రాన్ని ఏలిన బిఆర్ఎస్‌ను అరునెల్ల కింద జరిగిన అసెంబ్లీ ఎన్నికలు అధికారానికి దూరం చేయడం ఒకటైతే, పార్లమెంటు ఎన్నికలు ఆ పార్టీ ఉనికికే ప్రమాదకరంగా మారాయి.

రాష్ట్రంలోని పదిహేడు పార్లమెంటు స్థానాల్లో ఒక్క స్థానాన్ని కూడా ఆ పార్టీ గెలుచుకోలేక పోవడమే ఇందుకు కారణం. ఈ ఎన్నికల సందర్భంగా పార్టీ అనేక ఒడిదొడుకులను ఎదుర్కుంది. పార్టీ టికెట్ తీసుకుని కొందరు, పార్టీ టికెట్ ఆశించి భంగపడిన మరికొందరు మరోపార్టీ కండువ కప్పుకున్నారు. అలాంటివారిలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడొకరు కావడం ఆ పార్టీలో మరో రాజకీయ సంక్షోభానికి కారణంగా మారింది. సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌రెడ్డి నల్లగొండ లేదా భువనగిరి లోకసభ స్థానాన్ని ఆశించాడు. కాని, బిఆర్ఎస్ అధిష్టానం ఆయన్ను పక్కకు పెట్టడంతో విధిలేక ఆయన కాంగ్రెస్‌లో చేరిపోయాడు. కాంగ్రెస్‌లో ఉన్నా, బిఆర్ఎస్‌లో ఉన్నా ఉద్యమకారుడిగా సుఖేందర్ రెడ్డికి మంచి పేరుంది. ఆయన తన కుమారుడిని నిరాశపర్చడం పట్ల మనస్థాపం చెందమే కాకుండా, బిఆర్ఎస్ ఓటమిపైన చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. చెప్పుడు మాటలు వినడం వల్లే కెసిఆర్ ఓటమి చవిచూడాల్సి వొచ్చిందన్నది ఆయన మాటల్లోని సారాంశం. దానికి తోడు పార్లమెంటు ఎన్నికల సందర్భంలో గుత్తా అనుచరులంతా కాంగ్రెస్ తీర్థం తీసుకోవడం బిఆర్ఎస్ ఆగ్రహానికి కారణమైంది. శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లులు పెద్దల సభ ఆమోదానికి వొచ్చినప్పుడు తమ బెట్టును




చూపించాలనుకున్న బిఆర్ఎస్‌కు చ్హైర్మన్ తీరు ఇబ్బందికరంగా మారింది. దీంతో మండలి చైర్మన్‌గా ఉన్న గుత్తాపై అవిశ్వాసాన్ని ప్రకటించి, మరో వ్యక్తిని ఆ స్థానంలో ఎన్నుకోవాలన్నది బిఆర్ఎస్ అధిష్టానం ఆలోచనగా ఉన్నట్లు వార్తలు వొస్తున్నాయి. అయితే ఈ విషయంలో పార్టీ పెద్దలు మాత్రం పెదవి విప్పడంలేదు. ఏది జరిగినా బడ్జెట్ సమావేశాల్లో ఈ తంతు పూర్తి అవుతుందనుకుంటున్నారు. ఒకవేళ మండలి చైర్మన్ పైన బిఆర్ఎస్ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడితే, దాన్ని తమకు అనుకూలంగా ఏవిధంగా మలుచుకోవచ్చన్న ఆలోచనలో ఇప్పుడు కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తున్నది. మండలిలో నామమాత్రం బలమున్న కాంగ్రెస్, తన సంఖ్యాబలాన్ని పెంచుకునేందుకు పావులు కదుపుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బిఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎంఎల్ఏలు, ఇతర నాయకులు ఇప్పటికే ఆ పార్టీలో చేరిపోయారు. ఇప్పుడు మండలిలో తమ బలాన్ని పెంచుకునేందుకు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌ను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉంది. మండలిలో మొత్తం ఎంఎల్‌సీ సభ్యుల సంఖ్య 40. కాగా రెండు ఎంఎల్సీ స్థానాలు ఖాళీగా ఉండడంతో 38గా ఉంది. వీరిలో బిఆర్ఎస్ ఎంఎల్సీల సంఖ్య 26. అలాగే కాంగ్రెస్ ఎంఎల్సీలు కేవలం ఆరుగురు మాత్రమే.

ఎంఐఎం నుండి ఇద్దరు, బిజెపి నుండి ఒకరున్నారు. టీచర్ ఎంఎల్సీలు ఇద్దరున్నప్పటికీ వారు వోటింగ్‌కు దూరం ఉంటున్నారు. మండలిలో కూడా తమదే పై చెయ్యి కావాలంటే కాంగ్రెస్‌కు కనీసం 14 మంది ఎంఎల్సీలు అవసరం. ఇప్పటికే చాలా మందితో కాంగ్రెస్ మంతనాలు జరిపినట్లు వార్తలు వొస్తున్నాయి. వారి డిమాండ్ల పట్ల హామీలిచ్చి తమ పార్టీలోకి తెచ్చుకునే బాధ్యతలను పలువురు సీనియర్ నాయకులకు అప్పగించినట్లు తెలుస్తున్నది. ఈ ఏడాది మొదలు, మరో రెండేళ్ళకు టర్మ్ పూర్తి అవనున్న ఎంఎల్సీలకు తిరిగి మరో అవకాశం ఇవ్వడంతో పాటు వారి అదనపు కోరికలను కూడా నెరవేర్చేందుకు కాంగ్రెస్ హామీ ఇస్తున్నట్లు తెలుస్తున్నది. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే సభలో టు బై త్రి మెజార్టీ ఉండాలి. అందుకోసం బిఆర్ఎస్ ఎంఎల్సీలకు కాంగ్రెస్ గాలం వేస్తున్నది. ఇక్కడ మరో విషయమేంటే బిఆర్ఎస్ ఎంఎల్సీల్లో కాంగ్రెస్ నేపథ్యం ఉన్న బస్వరాజు సారయ్య, బండా ప్రకాశ్ లాంటివారు కొందరున్నారు. అలాంటివారితో పాటు, టిడిపి నుండి వొచ్చినవారు, నిన్నటివరకు బిఆర్ఎస్ విధేయులుగా ఉన్నవారిపైన కాంగ్రెస్ ఆకర్ష్ పథకాన్ని ప్రయోగిస్తున్నట్లు తెలుస్తున్నది. కాగా మండలిలోనైన ప్రతిష్ట దిగజారకుండా బిఆర్ఎస్ తన సభ్యులను ఎలా కాపాడుకుంటుందో చూడాలి.

# సచివాలయం లో సీఎం,డిప్యూటీ సీఎం

**సచివాలయానికి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కు ఎదురెళ్లి స్వాగతం పలికిన సీఎం చంద్రబాబు**

**నేడు పదవీ బాధ్యతలు చేపట్టనున్న డిప్యూటీ సీఎం పవన్**

**సచివాలయంలో తన చాంబర్ పరిశీలించడానికి వచ్చిన వైనం**

**సీఎం చంద్రబాబుతో సమావేశం**

**ఏపీ అధికారిక చిహ్నానికి వన్నె తెచ్చారంటూ చంద్రబాబును కొనియాడిన పవన్**




**అమరావతి** జూన్ 18, ప్రజావినికిడి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడు తొలిసారిగా సచివాలయంలోని చంద్రబాబు చాంబర్ కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సీఎం చంద్రబాబు స్వయంగా ఎదురెళ్లి స్వాగతం పలకడం విశేషం. పవన్ ను ఆత్మీయ ఆలింగనం చేసుకున్న చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఇక చంద్రబాబు చాంబర్ లోని ఏపీ అధికారిక చిహ్నాన్ని చూపిస్తూ ... ఆ గుర్తుకు వన్నె తీసుకువచ్చారంటూ చంద్రబాబును పవన్ కొనియాడారు. అందుకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇరువురు సమావేశమయ్యారు. ప్రభుత్వ ఏర్పాటు అనంతరం చంద్రబాబు, పవన్ భేటీ కావడం ఇదే ప్రథమం. కాగా, పవన్ కల్యాణ్ చాంబర్ కు వచ్చిన సందర్భంగా ఆయనను పలువురు అధికారులు కలిశారు. పవన్ తనకు కేటాయించిన పంచాయతీరాజ్ శాఖ వ్యవహారాలపై ఆరా తీశారు. పవన్ తో సచివాలయానికి వచ్చిన వారిలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ కూడా ఉన్నారు.

# అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతా

**పులివెందుల వెళ్లాలని భావించిన మాజీ సీఎం జగన్**

**నిర్ణయం మార్చుకున్న జగన్**



**అమరావతి** జూన్ 18, ప్రజావినికిడి:
ఈ నెల 20న తాడేపల్లిలో వైసీపీ అసెంబ్లీ, లోక్ సభ అభ్యర్థులతో కీలక సమావేశంఈ నెల 21వ తేది నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఎపి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ ఈ సమావేశాలకు హాజరుకానున్నారు.. ఈ మేరకు వైసిపి ఒక ప్రకటన విడుదల చేసింది.. ఈ సమావేశాలలో కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.. అలాగే స్పీకర్ ఎన్నిక కూడా ఈ సమావేశాలలో జరగనుంది.. దీంతో జగన్ రేపటి నుంచి రెండు రోజుల పాటు సాగే పులివెందుల పర్యటనను రద్దు చేసుకున్నారు..

# ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం!



హైదరాబాద్,జూన్ 18, ప్రజావినికిడి: రాష్ట్రంలో ఉద్యోగుల సాధారణ బదిలీలకు రంగం సిద్ధమైనట్టు సమాచారం. ఫైల్ సీఎం రేవంత్ రెడ్డి దగ్గరికి చేరినట్టు తెలుస్తున్నది. ఆమోదం పొందిన తర్వాత మార్గదర్శకాలు విడుదల చేసి 15 రోజుల్లోపు బదిలీలు పూర్తి చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఒకేచోట కనిష్ఠంగా రెండేండ్లు పనిచేసినవారికి దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించాలని ప్రతిపాదించినట్టు తెలిసింది.

గరిష్ఠంగా నాలుగేండ్లు ఒకేచోట పనిచేసినవారిని కచ్చితంగా బదిలీ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. ఈ బదిలీలతో స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖలో ప్రక్షాళన జరుగుతుందని చెప్తున్నారు. ఆయా శాఖల్లో కొందరు అధికారులు ఏండ్లుగా తిష్ట వేసుకొని పాతుకుపోయారు.

# మీరు గెలిస్తే ఈవీఎంలు చక్కగా పనిచేసినట్టు.... లేకపోతే పనిచేయనట్టా.?

**- మంత్రి నారా లోకేశ్.**

**-ఇటీవలి ఎన్నికల్లో ఈవీఎంల పనితీరుపై జగన్ సందేహాలు.**

**-జగన్ ట్వీట్ పై మండిపడుతున్న టీడీపీ నేతలు.**



**అమరావతి** జూన్ 18, ప్రజావినికిడి:
ఇటీవలి ఎన్నికల్లో ఈవీఎంల పనితీరుపై మాజీ సీఎం జగన్ సందేహాలు లేవనెత్తుతూ ట్వీట్ చేయడం తెలిసిందే. దీనిపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. 2019 ఎన్నికలప్పుడు ఈవీఎంల పనితీరు భేష్ అంటూ జగన్ చేసిన వ్యాఖ్యల వీడియోను టీడీపీ నేతలు షేర్ చేస్తూ, వైసీపీ తీరును ఎండగడుతున్నారు. తాజాగా, ఈ అంశంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కూడా స్పందించారు. "ప్రజా తీర్పును అంగీకరించాల్సిందే జగన్. మీకు ప్రజాస్వామ్యం అంటే గిట్టదు. ప్రజల హక్కులను పరిరక్షించడానికి ఏర్పాటైన సంస్థలు, వ్యవస్థలు, వేదికలను మీరు క్రమంగా నాశనం చేస్తూ వచ్చారు. ఏపీ ప్రజలు ఏళ్ల తరబడి సమష్టి కృషితో నిర్మించుకున్నవాటిని మీరు ఒక్క దెబ్బతో కూల్చేశారు. మీరు 2019లో గెలిచినప్పుడేమో ఈవీఎంలు చక్కగా పనిచేసినట్టా...! ఇప్పుడు మీరు 2024లో ఓడిపోతేనేమో ఈవీఎంలపై నిందలు వేస్తారా...! ఎంతటి నయవంచన! మీరు మీ పదవీకాలంలో విఫలమయ్యారని, అందుకే ప్రజలు మిమ్మల్ని పూర్తిగా తిరస్కరించారని ఇకనైనా మీరు గుర్తిస్తే బాగుంటుంది. అన్నట్టు... ఫర్నిచర్ ను తిరిగి ఎప్పుడు అప్పగిస్తున్నారు? పేదల కోసం ఉపయోగించాల్సిన రూ.560 కోట్ల డబ్బును మీ రుషికొండ ప్యాలెస్ కోసం ఎందుకు ఖర్చుపెట్టారు? ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ ప్రశ్నలకు సమాధానాలు కోరుతున్నారు" అంటూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

# పుష్ప-2 కొత్త రిలీజ్ డేట్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్లో వస్తున్న చిత్రం పుష్ప-2. ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్ ను చిత్ర బృందం నేడు ప్రకటించింది. డిసెంబరు 6న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ అవుతుందని వెల్లడించింది. ఈ మేరకు హీరో అల్లు అర్జున్ రిలీజ్ డేట్ పోస్టర్ ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. తలకు కట్టు, చేతిలో సమురాయ్ ఖడ్గం పట్టుకున్న అల్లు అర్జున్ ను ఈ పోస్టర్ లో చూడొచ్చు. అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన పుష్ప చిత్రం ఎంత పెద్ద హిట్టయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దాంతో పుష్ప-2పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన పాటలకు, టీజర్లకు విశేషమైన స్పందన లభించింది. వాస్తవానికి పుష్ప-2 చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేయాలని చిత్రబృందం భావించింది. అయితే, అదే రోజున రామ్ పోతినేని 'డబుల్ ఇస్మార్ట్' రిలీజ్ అవుతోంది. దాంతో పాటే మరికొన్ని బాలీవుడ్ చిత్రాలు కూడా అదే రోజున ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. అందువల్లే పుష్ప-2 రిలీజ్ డేట్ వాయిదా పడినట్టు టాక్ వినిపిస్తోంది.

# అప్పుడు భయం వేసింది : విజయ్ సేతుపతి



''మహారాజ' విడుదలకి ముందు హైదరాబాద్‌కి వచ్చాను. ఇక్కడ తెలుగు ప్రేక్షకులు నాపై చూపించిన ప్రేమాభిమానాలు చూసి కొంచెం భయం వేసింది. ఈ సినిమా తప్పకుండా విజయం సాధించాలని కోరుకున్నా.తెలుగు ప్రేక్షకులు అది నెరవేర్చడం ఆనందాన్నిచ్చింది. తెలుగు వారు నాపై చూపిన ప్రేమ చూస్తుంటే.. ఇది నా హోమ్‌టౌన్‌లానే అనిపిస్తోంది. నాకు ఈ అనుభూతిని ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు" అని హీరో విజయ్ సేతుపతి అన్నారు.నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించిన చిత్రం 'మహారాజ'. విజయ్ సేతుపతి హీరోగా నటించిన ఈ చిత్రంలో మమతా మోహన్‌దాస్, అనురాగ్ కశ్యప్ ఇతర లీడ్ రోల్స్ చేశారు. సుధన్ సుందరం, జగదీష్ పళనిసామి నిర్మించారు. ఈ మూవీని తెలుగులో ఎన్‌వీఆర్ సినిమా ఈ నెల 14న రిలీజ్ చేసింది.హైదరాబాద్‌లో నిర్వహించిన 'మహారాజ' మూవీ థ్యాంక్స్ మీట్‌లో నితిలన్ సామినాథన్ మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకుల నుంచి మా 'మహారాజ'కి లభిస్తున్న ఆదరణ చాలా ఆనందాన్నిచ్చింది" అన్నారు ''మహారాజ'ని కుటుంబంతో కలసి చూడండి.. చాలా ఎంజాయ్ చేస్తారు" అన్నారు అతిథిగా పాల్గొన్న డైరెక్టర్ మారుతి. ''ఈ మధ్య కాలంలో నేను చూసిన మంచి సినిమా 'మహారాజ" అన్నారు మరో అతిథి గోపీచంద్ మలినేని. ''ఈ సినిమా హిట్ ఏ రేంజ్‌కి వెళ్లి ఆగుతుందో చెప్పలేం" అన్నారు ఇంకో అతిథి బుచ్చిబాబు సాన. డైరెక్టర్ అనీల్ కన్నెగంటి, డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కావ్య పాప.. ఎర్రటి చీరలో చందమామలా..



కావ్య కళ్యాణ్ రామ్ చాలా తక్కువ టైమ్ లోనే టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. "బలగం" సినిమాలో ప్రియదర్శి జోడీగా నటించి మంచి పేరు సంపాదించిన ఈ నటి తన క్యూట్ లుక్స్ తోనే ఎక్కువగా ఎట్రాక్ట్ చేస్తోంది. గతంలో "మసూద" సినిమాలో హీరోయిన్‌గా నటించినప్పటికీ, కావ్యకు "బలగం" తోనే పెద్ద గుర్తింపు వచ్చింది. ఇప్పుడు చిన్న, మధ్య తరహా చిత్రాలలో కూడా మంచి హిట్లు కొట్టాలని ప్రయత్నిస్తోంది ఈ యువ నటి. అల్లు అర్జున్ "గంగోత్రి" సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ గా ఆమె కెరీర్ మొదలయ్యింది. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ "బాలు", చిరంజీవి "ఠాగూర్", ప్రభాస్ "అడవి రాముడు" వంటి సినిమాలలో కూడా నటించింది. ఇండస్ట్రీలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా మంచి ఛాన్సులు వచ్చినప్పటికీ, ఆమె తన చదువులకు ప్రాధాన్యం ఇచ్చింది. 2008 నుంచి చిత్ర పరిశ్రమకు దూరంగా ఉంటూ ఎడ్యుకేషన్ ను పూర్తిచేసింది. %ూశ్రీంశీ =ఝుఎ% – విశ్వక్ ఈసారి మరింత ఫోకస్ గా..! చదువు ముగిసిన తర్వాత, మళ్లీ సినిమాలలో రీ ఎంట్రీ ఇవ్వాలనే ఉద్దేశంతో ఆడిషన్లు ఇవ్వడం ప్రారంభించింది. అలా "మసూద" సినిమాతో నాయికగా టాలీవుడ్‌కి రీ ఎంట్రీ ఇచ్చింది కావ్య. ఈ సినిమా ద్వారా ప్రేక్షకులను మెప్పించింది. ఆ తర్వాత "బలగం" సినిమాలో నటించి మరింత పేరు తెచ్చుకుంది. అనంతరం సింహా కోడూరి హీరోగా నటించిన "ఉస్తాద్" సినిమాలో కూడా తన ప్రతిభను చూపించింది. అయితే ఆ సినిమా అనుకున్నంత స్థాయిలో విజయవంతం కాలేదు. ప్రస్తుతం ఆమెకు పలు ఆఫర్లు వస్తున్నట్లు సమాచారం. త్వరలోనే కొత్త ప్రాజెక్టులను అనౌన్స్ చేయనుంది కావ్య. ఇక సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉండే ఈ ముద్దుగుమ్మ, అభిమానులతో టచ్‌లో ఉంటోంది. ఇటీవలి కాలంలో ఫోటోషూట్స్ చేస్తూ తన గ్లామర్ ను చూపిస్తోంది. రీసెంట్ గా నల్ల రైక, ఎర్ర చీర కట్టుకుని బ్యూటీఫుల్ గా ఎట్రాక్ట్ చేసింది. ఆ ఫోటోలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.ఈ ఫోటోలలో కావ్య క్యూట్ పోజులిచ్చి అందరినీ ఫిదా చేసింది. అభిమానులు పాజిటివ్ గా కామెంత్ చేస్తూ ఆమె గ్లామర్ ను ప్రశంసిస్తున్నారు. ఇక ఆమె ఎలాంటి డ్రెస్ లో కనిపించినా అందమే అంటూ మరికొందరు పాజిటివ్ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ బ్యూటీ మంచి కంటెంట్ ఉన్న ప్రాజెక్టులు వస్తే గ్లామర్ రోల్స్ కూడా చేయాలని అనుకుంటోంది. వీలైనంత వరకు డిఫరెంట్ ప్రాజెక్టులను సెలెక్ట్ చేసుకుంటున్న కావ్య స్టార్ హీరోలతో కూడా ఛాన్స్ లు అందుకోవాలి అని ప్రయత్నం చేస్తోంది. మరి రాబోయే రోజుల్లో అమ్మడికి ఎలాంటి ఆఫర్స్ వస్తాయో చూడాలి.

# విశ్వక్ ఈసారి మరింత ఫోకస్ గా..!




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ వరుస సినిమాలతో ఫ్యాన్స్ ని ఖుషి చేస్తున్నాడు. ఈ ఇయర్ మార్చిలో గామితో వచ్చిన విశ్వక్ సేన్ లాస్ట్ మంత్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి తో వచ్చాడు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా విశ్వక్ సేన్ మాస్ యాంగిల్ ని కొత్తగా చూపించేలా చేశారు. సినిమా కూడా ఆడియన్స్ ని మెప్పించింది. ఐతే యువ హీరోలంతా కూడా 100 కోట్ల సినిమాలతో అదరగొడుతున్న సందర్భంగా విశ్వక్ సేన్ కూడా నెక్స్ట్ సినిమా టార్గెట్ 100 కోట్లు పెట్టుకున్నాడు. అందుకోసం తను చేస్తున్న సినిమాలకు మరింత ఫోకస్ తో పనిచేస్తున్నాడు. విశ్వక్ సేన్ ప్రస్తుతం మెకానిక్ రాకీ సినిమాతో పాటుగా లైలా అనే సినిమా కూడా చేస్తున్నాడు. మెకానిక్ రాకీ సినిమా రవితేజ ముల్లపూడి డైరెక్ట్ చేస్తుండగా.. లైలా సినిమాను రామ్ నారాయన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రెండు సినిమాలు కూడా డిఫరెంట్ స్టోరీ స్క్రీన్ ప్లే తో వస్తున్నాయని తెలుస్తుంది. విశ్వక్ సేన్ ఈ రెండు ప్రాజెక్ట్ ల మీద సూపర్ కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. మెకానిక్ రాకీ సినిమా ఆల్రెడీ సెట్స్ మీద ఉండగా లైలాని ఈమధ్యనే సెట్స్ మీదకు తీసుకెళ్లారని తెలుస్తుంది. యువ హీరోల్లో సినిమా సినిమాకు తన గ్రాఫ్ పెంచుకుంటూ సత్తా చాటుతున్న విశ్వక్ సేన్ రాబోతున్న సినిమాలతో కూడా తన స్టామినా చూపిస్తాడని అంటున్నారు. ఐతే ఈసారి టార్గెట్ ని భారీగా ఫిక్స్ చేసుకుని అందుకు తగినట్టుగానే వర్క్ అవుట్ చేస్తున్నట్టు తెలుస్తుంది. ఈ రెండు సినిమాలు పూర్తి చేసిన తర్వాతే నెక్స్ట్ సినిమా గురించి అప్డేట్ ఇస్తారని తెలుస్తుంది. టాలీవుడ్ నెక్స్ట్ జనరేషన్ స్టార్ గా అవతరించే క్వాలిటీస్ అన్నీ ఉన్న విశ్వక్ సేన్ కథల ఎంపికలో ఇంకాస్త ఫోకస్ చేస్తే మాత్రం నెవర్ బిఫోర్ అనే రేంజ్ లో ఫలితాలను అందుకుంటాడు. మరి విశ్వక్ సేన్ కలను నిజం చేసే సినిమా ఏది అవుతుందో చూడాలి. సినిమా ఫలితం తో సంబంధం లేకుండా తన ఫుల్ ఎఫర్ట్స్ తో ది బెస్ట్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నాడు విశ్వక్ సేన్. మాస్ కా దాస్ ఫ్యాన్స్ కు రానున్న సినిమాలతో మాస్ ఫీస్ట్ అందించడానికి విశ్వక్ సేన్ సిద్ధం అవుతున్నాడని చెప్పొచ్చు

# యానిమల్ స్టార్ కెరీర్ పాఠాలు



బాలీవుడ్ సూపర్ బ్లాక్ బస్టర్ మూవీ యానిమల్ లో విలన్ గా నటించడం ద్వారా పాన్ ఇండియా స్టార్ డమ్ దక్కించుకున్న నటుడు బాబీ డియోల్. యానిమల్ సినిమా తర్వాత ఒక్కసారిగా బాబీ డియోల్ బిజీ అయ్యాడు. తెలుగు లో బాలయ్య తో కలిసి ఒక సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. తమిళ మరియు హిందీ భాష సినిమాల్లో కూడా బాబీ డియోల్ నటిస్తున్నాడు. గతంలో హీరోగా బ్లాక్ బస్టర్ లను అందించిన బాబీ డియోల్ ఇప్పుడు విలన్ గా , క్యారెక్టర్ ఆర్టిస్టుగా వరుస సినిమాలు చేస్తూ బాక్సాఫీస్ వద్ద సందడి చేసేందుకు రెడీ అవుతున్నాడు. %ూశ్రీంశీ =ఝుఎ% – కావ్య పాప.. ఎర్రటి చీరలో చందమామలా.. ఆ మధ్య బాబీ డియోల్ పూర్తిగా ఫేడ్ ఔట్ అయ్యాడు. ఇక ఆయన సినిమాలు రావనుకున్న సమయంలో అనూహ్యంగా రీ ఎంట్రీ ఇచ్చాడు. రీ ఎంట్రీతో బాబీ డియోల్ సత్తా చాటుతున్నాడు. తాజాగా ఒక జాతీయ మీడియా సంస్థతో బాబీ డియోల్ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించి వైరల్ అయ్యాయి. బాబీ డియోల్ మాట్లాడుతూ... సినిమాల ఎంపిక విషయంలో అప్రమత్తంగా ఉండకుంటే అందరూ సలహాలిస్తూ ఉంటారు. అందులో ఏ ఒక్క సలహా తీసుకున్నా కూడా చాలా నష్టం జరుగుతుంది. సొంతంగా ఆలోచించడం అనేది చాలా ముఖ్యమైన విషయం. సినిమాల ఎంపిక విషయంలో కొన్ని సార్లు సరైన నిర్ణయాలను తీసుకోలేక పోవచ్చు. కొన్ని సార్లు దర్శక నిర్మాతల వల్ల మోస పోవచ్చు. %ూశ్రీంశీ =ఝుఎ% – విశ్వక్ ఈసారి మరింత ఫోకస్ గా..! ఛాలెంజింగ్ రోల్స్ గురించి భయపడినప్పుడు అలాంటి తప్పుడు నిర్ణయాలను తీసుకుంటూ ఉంటాం. ఇంతకు ముందు కంఫర్ట్ జోన్ లో ఉండి సినిమాలను ఎంపిక చేసుకునేవాడిని. కానీ ఇప్పుడు ఆ కంఫర్ట్ జోన్ అనేది లేకుండా చూసుకుంటున్నాను. ప్రతి విషయంలో కూడా చాలా జాగ్రత్తగా ఉంటాను, అంతే కానీ భయపడను అన్నట్లుగా చెప్పుకొచ్చాడు. సినిమా ఇండస్ట్రీలో వచ్చే మార్పులను గమనిస్తూ మనం సినిమాలు చేయాల్సి ఉంటుంది, అందుకు తగ్గట్లుగా పాత్రలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. అలా కాదని ఇష్టానుసారంగా సినిమాలకు కమిట్ అయితే మాత్రం ఖచ్చితంగా నష్టం జరుగుతుందని బాబీ డియోల్ పేర్కొన్నాడు.

# దర్శకుడు తేజ ఆవిష్కరించిన

## "పోలీస్ వారి హెచ్చరిక " టైటిల్ లోగో




అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో తూలికా తనిష్క్ క్రియేషన్స్ పతాకంపై బెల్లి జనార్ధన్ నిర్మిస్తున్న పోలీస్ వారి హెచ్చరిక సినిమా టైటిల్ లోగోను యూత్ ఆడియెన్స్ ఐకాన్ డైరెక్టర్ తేజ మంగళవారం రోజున ఆయన కార్యాలయం లో ఆవిష్కరించారు%ొా.!
ఈ సందర్భంగా దర్శకుడు తేజ మాట్లాడుతూ "" ఏ సినిమా కైన ప్రేక్షకులను ఆకర్షించేది , వారిని థియేటర్ ల వద్దకు నడిచేలా చేసేది టైటిల్ మాత్రమే అని %ొా% ఈ "" పోలీస్ వారి హెచ్చరిక"" అనే టైటిల్ కూడా అలాంటి శక్తివంతమైన మాస్ టైటిల్ అని , ఈ టైటిల్ దర్శక నిర్మాతలకు కొంగు బంగారం గా మారి విజయాన్ని చేకూరుస్తుందని "" పేర్కొన్నారు%ొా%.! "" విజయాలను సెంటిమెంట్ గా మలుచుకున్న సక్సెస్ ఫుల్ దర్శకుడు తేజ గారి చేతుల మీదుగా మా సినిమా పబ్లిసిటీ నీ ప్రారంభించడం మాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని , దీనిని ఒక శుభసూచిక గా మేము భావిస్తున్నామని నిర్మాత బెల్లి జనార్ధన్ పేర్కొన్నారు%దర్శకుడు బాబ్జీ మాట్లాడుతూ సినిమా షూటింగ్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని అద్భుతమైన లొకేషన్ లలో పూర్తి చేశామని , ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుందని %ొా%" తెలిపారు%ొా%! సన్నీ అఖిల్ , అజయ్ ఘోష్ , రవి కాలే , గిడ్డేశ్ , శుభలేఖ సుధాకర్ , షియాజీ షిండే , హిమజ , జయవాహినీ , శంకరాభరణం తులసి , ఖుషి మేఘన , రుచిత , గోవింద , హనుమ, బాబురాం తదితరులు ఈ చిత్ర తారాగణం

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613